క్లుప్తంగా

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు

గంట్యాడ: వరి సాగులో సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు సూచించారు. వరి పంటను ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన చర్యలపై మండలం లోని కొండతామరాపల్లి గ్రామంలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో కలుపు, చీడపీడలు, తెగుళ్ల నివారణకు అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో జీవామృతంతో కూగా తెగుళ్లను నివారించవచ్చని తెలిపారు. ఏఓ బి. శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణపై సర్వే



పాటూరులో సర్వే చేస్తున్న సర్వేయర్ అప్పలనాయుడు, తదితరులు

వేపాడ: కొత్తవలస-ఎస్.కోట ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి మండల సర్వేయర్ అప్పలనాయుడు బృందం శుక్రవారం సర్వే నిర్వహించింది. సర్వేయర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా పాటూరు రెవెన్యూలో భూములు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారి వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. నివేదికను తహసీల్దార్ ద్వారా ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. వీఆర్ఓ రాజు, పాటూరు, వావిలపాడు సర్వేయర్లు పాల్గొన్నారు.

క్రీడామైదానాల అభివృద్ధికి చర్యలు



కేజీబీవీ క్రీడామైదానం కొలతలు తీస్తున్న పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది

వేపాడ: పాఠశాలల క్రీడా మైదానాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మండలంలోని బక్కునాయుడుపేట గురుకు ల బాలికల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల క్రీడామైదానం అభివృద్ధికి పంచాయతీరాజ్ ఏఈ మహ్మద్ ఆలీ శుక్రవారం సర్వే నిర్వహించారు. మైదానాల అభివృద్ధి, అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.

పశువైద్యశిబిరం



పశువులకు చూడిద తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి గాయత్రీదేవి

లక్కవరపుకోట: సీతారామపురం గ్రామంలో ఎల్.కోట పశువైద్యకేంద్రం వైద్యాధికారి కె.గాయత్రీ దేవి ఆధ్వర్యంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఎదకురాని పశువులకు తనిఖీలు చేశారు. గర్భకోశ వ్యాధులు సోకిన పశువులకు వైద్యం అందించారు. పశు పోషణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు సూచనలు చేశారు.

రూ.13 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

రాజాం: పట్టణంలోని గాంధీనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. మున్సిపల్ అభివృద్ధి నిధులు రూ.13 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఏఈ పి.వెంకట్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పనులను పరిశీలించారు.

జనసంద్రం.. జగన్నినాదం

- సీఎం జగన్ బహిరంగ సభ విజయవంతం
- జనంతో కిక్కిరిసిన సభా ప్రాంగణం, బయటే ఉండి పోయిన వేలాది మంది



సీఎం జగన్‌కు అభివాదం తెలుపుతున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి



సభా ప్రాంగణంలో ఖాళీ లేక బయట జాతీయ రహదారిపై నిల్చొని సీఎం జగన్ ప్రసంగం వింటున్న జనం



సీఎం జగన్, కేంద్రమంత్రికి అభివాదం తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు



ముఖ్యమంత్రికి, కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న జీసీసీ చైరపర్సన్ శోభా స్వాతిరాణి



సీఎం జగన్, కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సీఎం జగన్, కేంద్రమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛంఅందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు



సీఎంకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు

బొండపల్లి/గజపతినగరం/దత్తిరాజేరు: సాలూరు నియోజకవర్గంలోని చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం, మరడాం గ్రామం వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి గజపతినగరం నియోజకవర్గానికి రావడంతో తమ అభిమాన నాయకుడిని చూసేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది జనం తరలివచ్చారు. అభిమానులు, పార్టీ కార్యకర్తలతో సభాప్రాంగణం పూర్తిగా నిండిపోవడంతో వేదిక వెనుక వైపున వందలాది మంది ఉండిపోయారు. సభాప్రాంగణాన్ని అనుకుని ఉన్న జాతీయ రహదారి-26పై వేలాది మంది నిల్చొని సీఎం, కేంద్ర మంత్రి ప్రసంగాలను విన్నారు. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు జై జగన్ నినాదాలు వినిపించాయి. సభాప్రాంగణం జగన్నినాదంతో మారుమోగింది. బహిరంగ సభ నేపథ్యంలో పక్కనే ఉన్న జాతీయ రహదారి-26పై రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి సభ విజయవంతం కావడంతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, గజపతినగర ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు.

స్వాగతం పలికిన ప్రజాప్రతినిధులు

మరడాం సభా వేదిక సమీపంలోని హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు.

అన్ని వర్గాలకు అండగా నిలిచాం..

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గనివాడ పంచాయతీ శివారు గ్రామం నిడుగట్టులో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వర్షం కురుస్తున్నప్పటికీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన కొన్ని సమస్యలను అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మరికొన్నింటిని సచివాలయ సిబ్బందితో నమోదు చేయించి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులను గ్రామాల్లోనే అందిస్తుండడంతో పాటు, పంట కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వంలో పరిహారం ఎప్పుడు వచ్చేదో, ఎవరికీ అర్థమయ్యేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు సకాలంలో పంటనష్ట పరిహారం అందుతోందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు,స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు రవ్వ శివ శంకర్, గేదెల లక్ష్మి, కార్పొరేషన్‌ల డైరెక్టర్లు దొడ్డి రాంబాబు, ఎస్‌కే మదీన, నాయకులు గేదెల శాంత, గేదెల సూరినాయుడు, గేదెల విజయ్‌కుమార్, గొలగాని సత్యనారాయణ, ఆవాల సత్యనారాయణ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



నర్సింహమూర్తికి అభినందనలు తెలుపుతున్న పార్టీ నాయకులు

గంట్యాడ: జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన జెడ్పీటీసీ వర్రి నర్సింహమూర్తికి మండలానికి చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. నీలావతి గ్రామంలోని ఆయన నివాసానికి మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ రంధి రాము, సర్పంచ్‌లు పతివాడ భాస్కరరావు, రఘుమండ అప్పలనాయుడు,సంక్రాన సత్తిబాబు, నాయకులు కిలపర్తి అప్పలనాయుడు పాల్గొన్నారు.

28న ఇసుక వేలం

గుర్ల: అక్రమంగా ఇసుక తరలింపు కేసుల్లో సీజ్ చేసిన ఇసుకను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈనెల 28న వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ హరిబాబునాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయిదు ట్రాక్టర్ల ఇసుకను తహసీల్దార్ పర్యవేక్షణలో వేలం వేయనున్నామని, ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

చురుగ్గా సరిహద్దురాళ్ల ఏర్పాటు

వంగర: గ్రామాల్లో సమగ్రంగా భూముల రీసర్వే చేపడుతున్నట్లు మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు అన్నారు. అరసాడలో జరుగుతున్న సరిహద్దురాళ్ల ఏర్పాటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇప్పటికే సర్వే పూర్తయిందని, 1632 చోట్ల సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్వయర్లు డి.నవ్య, జి.సింధుజ, జి.కిరణ్ తదితరులున్నారు.

వైభవంగా వరలక్ష్మి పూజలు

శ్రావణమాసం రెండో శుక్రవారం కావడంతో గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు తమ ఇళ్లలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఆలయాల్లో అర్చకులు మహిళలతో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు చేయించారు. అమ్మవార్లను గాజులతో విశేషంగా అలంకరించారు. వందల సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వేపాడ: బొద్దాం రామాలయంలో సామూహిక కుంకమపూజలు చేస్తున్న భక్తులు



చీపురుపల్లి: గాజుల అలంకరణలో చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు



చీపురుపల్లి: రామలింగాపురంలోని మానసాదేవి నాగశక్తి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



శృంగవరపుకోట: ఎస్.కోట దేవీచౌక్ వద్ద ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి



జామి: అలమండలో పూజలందు కుంటున్న కనకదుర్గమ్మ



చీపురుపల్లి: మానసాదేవీ నాగశక్తి అమ్మవారి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



కొత్తవలస: మంగళపాలెంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్టులో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న గిరిజనులు



గజపతినగరం: గజపతినగరంలోని తన నివాసంలో వరలక్ష్మీ వ్రతం పూజలు చేస్తున్న ఎంపీపీ జ్ఞానదీపిక దంపతులు



బొండపల్లి: దేవుపల్లి రాజ రాజేశ్వరీదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జామి: జామిలో పూజలందు కుంటున్న కనక దుర్గమ్మ

సంపూర్ణ పారిశుద్ధ్య విధానానికి సహకరించాలి

- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు



కొత్తపేట నీళ్లట్యాంక్ వద్ద వాటర్ ట్యాంకర్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు

విజయనగరం: నగరంలో సంపూర్ణ పారిశుద్ధ్య విధానానికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములునాయుడు కోరారు. శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన తాగునీటి పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ, రక్షిత మంచినీటి పథకాలు, పార్కుల నిర్వహణను పరిశీలించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా అమ్మకాలు చేపడితే ఉపేక్షించమని హెచ్చరించారు. మహిళా పార్కును సందర్శించిన ఆయన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే పైపులైన్ల లీకులు లేకుండా చూడాలని తెలిపారు. గంటస్తంభం జంక్షన్, కన్యకాపరమేశ్వరి ఆలయ జంక్షన్‌లో చిరువ్యాపారాలు ఇబ్బందికర వాతావరణంలో కొనసాగుతున్నాయని, అక్కడి వ్యాపారుల వల్ల ప్రధాన రోడ్లు చెత్తాచెదారంతో నిండిపోవడంతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో చిరువ్యాపారుల అమ్మకాలను క్రమబద్ధీకరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురదనీరు ఎక్కడ నిల్వ ఉండకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. అందరి సహకారంతో నగర ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు.